సాక్షి కర్నూలు

గురువారం । 9 । అక్టోబర్ । 2025



సేవలు దూరమై!

గ్రామ సచివాలయాలపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. దీంతో నాగలదిన్నె గ్రామంలో ఉదయం 11 గంటలైనా సచివాలయానికి తాళం తీయలేదు. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

8లో▸



ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లు

ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 16న కర్నూలు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు చకచకగా సాగుతున్నాయి. ఏర్పాట్లను బుధవారం సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పరిశీలించారు.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,626.06
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 10,983
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 10,573

న్యూస్‌రీల్

పంట పొలాల్లో చిరుత సంచారం



చిరుత పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

ఆలూరు: ఆస్పరి మండలం జొహరాపురం, ఆలూరు మండలం మొలగవెల్లి, పెద్దహోతూరు గ్రామాల పంటపొలాల్లో మూడు రోజుల నుంచి చిరుతపులి సంచరిస్తున్నట్లు రైతులు తెలిపారు. ఆలూరు ఫారెస్ట్ సెక్షన్ అధికారి శ్రీనివాసులు, ఎఫ్‌ఆర్‌ఓ తేజస్విణికి ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం సిబ్బందితో కలసి బీట్ అధికారులు బాలకృష్ణ, విమల్ కుమార్ జొహరాపురం పంట పొలాల్లో చిరుత పాద ముద్రలను పరిశీలించారు. రైతులు, ప్రజలకు పంట పొలాలకు ఒంటరిగా వెళ్లవద్దని సూచించారు.

ఎల్లెల్సీకి కోటా నీటిని అందిస్తాం



ఎల్లెల్సీని పరిశీలిస్తున్న టీబీ బోర్డు చైర్మన్, సెక్రటరీ, ఎస్ఈ తదితరులు

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)కు సంబంధించి ఆంధ్రా కోటా నీటిని పూర్తిస్థాయిలో అందిస్తామని, జలచౌర్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని టీబీ బోర్డు చైర్మన్ ఎస్ఎన్ పాండే, సెక్రటరీ ఓఆర్‌కె రెడ్డి, ఇన్‌చార్జ్ ఎస్ఈ నారాయణనాయక్ తెలిపారు. దిగువ కాలువపై బుధవారం వారు పర్యటించారు. ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు అందుతుందో లేదో తెలుసుకున్నారు. అక్విడేటర్లు, అండర్‌టెన్నల్(యూటీ) లను పరిశీలించి వాటి ద్వారా బయటకెళ్తున్న నీటి గురించి ఆరా తీశారు. కాలువ పక్కన ఉన్న పొలాలకు అక్రమంగా నీటిని మళ్లించుకోకుండా(సైఫింగ్) తగిన చర్యలు తీసుకోవాలని సెక్షన్ ఆఫీసర్లను ఆదేశించారు. వారి వెంట ఎస్డీఓలు హుసేన్‌బాషా, సురేష్‌బాబు ఉన్నారు.

8 చెరువుల్లో పూడికతీత పనులు

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో జిల్లాలోని వివిధ చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పరిపాలన అనుమతులు ఇచ్చారు. ఇందుకోసం రూ.36.64 లక్షలు మంజూరు చేశారు. ఈ పనులు ఉపాధి నిధులతో చేపట్టే విధంగా కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. సీ.బెలగల్ మండలంలో 3, గూడూరు మండలంలో రెండు, ఆదోని, చిప్పగిరి, వెల్దుర్తి మండలాల్లో ఒక్కొక్కటి ప్రకారం 8 చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టనున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

10న పారామెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో డిప్లమా ఇన్ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ సర్వీసెస్ కోర్సులకు ఈ నెల 10న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కళాశాలలోని ఆడిటోరియంలో కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ఇంటర్ బైపీసీ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఇంటర్ ఒరిజినల్ మార్క్స్' మెమో లేని వారి దరఖాస్తులు తిరస్కరిస్తామన్నారు.

భూసంరక్షణ అక్రమాలపై విచారణాధికారి నియామకం

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖ భూ సంరక్షణ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తూ ఆయన సాగించిన అక్రమాలపై సమగ్ర విచారణకు విచారణాధికారిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. లక్ష కాదు.. రెండు లక్షలు కాదు.. ఏకంగా రూ.36 లక్షలు కొల్లగొట్టారు. అనుమతి లేకుండానే అద్దె వాహనాలు వినియోగించారు. సెల్ఫ్ చెక్‌లతో నిధులు స్వాహా చేశారు. అక్రమాలపై ఈ ఏడాది జనవరిలో 14 అభియోగాలు నమోదయ్యాయి. తాజాగా వ్యవసాయ శాఖలో అడిషనల్‌మ డైరెక్టర్‌గా పనిచేస్తున్న వినయ్‌చంద్‌ను విచారణాధికారిగా నియమిస్తూ వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ డైరెక్టర్ రాజశేఖర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2013 నుంచి దాదాపు మూడేళ్లపాటు భూసంరక్షణ విభాగం ఆదోని ఏడీఏగా పనిచేస్తున్నప్పుడు నిధులను ఇష్టారాజ్యంగా దుర్వినియోగం చేశారు. వ్యవసాయ శాఖలో డిప్యూటీ డైరెక్టర్ అయిన రాముునాయక్ ప్రస్తుతం శ్రీసత్యసాయి జిల్లా రైతుశిక్షణ కేంద్రం డీడీఏగా ఉన్నారు.

‘వెలగని’ వ్యవసాయం!

విద్యుత్ కనెక్షన్ల జారీలో నిర్లక్ష్యం

- 16 నెలల్లో ఇచ్చిన కనెక్షన్లు అత్తెసరే..
- దరఖాస్తు చేసుకొని నిరీక్షిస్తున్న రైతులు
- డబ్బు చెల్లించిన రైతులకూ తప్పని నిరాశ
- కొత్త కనెక్షన్లకు పాత డీపీలతో సరిపుచ్చుతున్న వైనం
- అస్తవ్యస్తంగా 9 గంటల వ్యవసాయ విద్యుత్
- డిమాండ్‌కు తగినట్లు అందుబాటులో లేని ఫీడర్లు

ఉమ్మడి జిల్లాలో పెండింగ్ దరఖాస్తులు

కర్నూలు జిల్లాలో	నంద్యాల జిల్లాలో
2,560	2,386

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. బోరు వేసుకొని, నీళ్లు ఆశాజనకంగా ఉన్నా విద్యుత్ కనెక్షన్ లేక రైతులు దిగాలు చెందుతున్నారు. ఎస్టిమేషన్ ప్రకారం నాన్ సబ్సిడీ మొత్తం చెల్లించినా కనెక్షన్ ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. పది, వంద కాదు.. ఏకంగా 5వేలకు పైగా రైతులు కనెక్షన్ల కోసం నిరీక్షిస్తున్నారు. వర్షాధారం కింద పంటల సాగు గాలిలో దీపంలా మారిన పరిస్థితుల్లో.. బోర్లు, బావుల్లో నీళ్లున్నా విద్యుత్ కనెక్షన్ లేక రైతులు పంటలు పండించుకోలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 16 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ అవసరమైన మేరకు కనెక్షన్లు ఇవ్వలేకపోతోంది. హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ కింద వివిధ మండలాల్లో బావులు, బోర్లలో భూగర్భ జలాలు పెరుగడంతో ఆరుతడి పంటలతో పాటు కూరగాయల పంటల సాగుకు అవకాశం ఏర్పడింది. అయితే విద్యుత్ కనెక్షన్లు లేక రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు.

పాత డీపీలే దిక్కు

వ్యవసాయ విద్యుత్ కోసం రైతులు దరఖాస్తు చేసుకుంటే విద్యుత్ అధికారులు ఎస్టిమేట్లు వేస్తారు. ఆ ప్రకారం రైతులు నాన్ సబ్సిడీ అమౌంటును డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. కనెక్షన్‌కు డీపీ విధిగా కొత్తది అమర్చాలి. కానీ విద్యుత్ శాఖలో కొత్త డీపీలు ఏమి చేస్తున్నారో తెలియని పరిస్థితి. రైతులకు మాత్రం పాత డీపీలు ఇస్తున్నారు.

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం ప్రదక్షిణలు



ఈ చిత్రంలో కనిపించే రైతు పేరు ఎర్రిస్వామి, మద్దికెర మండలం బసినేపల్లి గ్రామానికి చెందిన సన్నకారు రైతు. ఈయన వైఎస్ఆర్‌సీపీ హయాంలో బోరు వేయించుకున్నాడు. నీళ్లు కూడ పడ్డాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం విద్యుత్ అధికారులు వేసిన ఎస్టిమేట్ ప్రకారం నాన్ సబ్సిడీ అమౌంటు కూడ చెల్లించారు. పోల్స్ వేసి డీపీ కూడ పెట్టారు. నిబంధనల ప్రకారం విద్యుత్ శాఖనే వారి వాహనం ద్వారా డీపీ సరఫరా చేయాలి. కాని స్వంత ఖర్చులతో డీపీ తెచ్చుకున్నారు, బోల్టాలు, మెటీరియల్ మొత్తం రైతులే తెచ్చుకున్నారు. అర్త్ గుంతలు కూడ తవ్వుకున్నారు. కాని ఇంతవరకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. గ్రామంలో ఇటువంటి రైతులు నలుగురు ఉన్నారు. విద్యుత్ కనెక్షన్ కోసం విద్యుత్‌మ అధికారుల చుట్టు ప్రదక్షణలు చేస్తున్నా.. మెటీరియల్ రాలేదని, ఇతరత్రా కారణాలతో జాప్యం చేస్తున్నారు.

–ఎర్రిస్వామి, బసినేపల్లి, మద్దికెర మండలం

కాలిపోయి, చెడిపోయి, తుప్పు పట్టిన డీపీలకు మరమ్మతులు చేసి కొత్త వ్యవసాయ విద్యుత్ కలెక్షన్‌కు అంటగడుతున్నారు. వేలాది రూపాయలు చెల్లించినప్పటికీ పాత డీపీలే ఇస్తుండటం పట్ల రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కొత్త డీపీల్లో సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది. పాత డీపీలు ఇవ్వడం వల్ల లోవోల్టేజీ, హై వోల్టేజీ వల్ల కాలిపోయే ప్రమాదం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

5వేల మంది రైతుల ఎదురుచూపులు

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు వేలాది రూపాయలు చెల్లించారు. కనెక్షన్ కోసం వాటా సొమ్ము చెల్లించిన రైతులు ఉమ్మడి జిల్లాలో 5వేల మందికిపైగా ఉన్నారు. అయితే కనెక్షన్లు ఇవ్వడంలో అంతులేని జాప్యం నెలకొంది. వ్యవసాయ కనెక్షన్ల కోసం డబ్బు చెల్లించిన రైతులు 2,500 మంది ఉండగా.. దరఖాస్తు చేసుకున్న రైతులు మరో 5వేల మందికి పైమాటే. ఈ రైతులకు సంబంధించి విద్యుత్ అధికారులు ఎస్టిమేట్లు వేసి డిమాండ్ నోటీసులు ఇస్తే తమ వాటా సొమ్ము చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారు. 2014–15 నుంచి 2018–19 వరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల జారీలో అంతులేని జాప్యం జరిగింది. నాన్ సబ్సిడీ మొత్తం చెల్లించిన సంవత్సరానికి కూడా కనెక్షన్లు ఇచ్చిన దాఖలాలు లేవు. నాటి తరహాలోనే ఇప్పుడు కూడా అలసత్వం చోటు చేసుకోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే అంతే!

2019–20 నుంచి 2023–24 వరకు అధికారంలో ఉన్న వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వడానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చింది. దళారీల ప్రమేయం లేకుండా.. రైతుల నుంచి ఒక్క రూపాయి వసూలు చేయకుండా ట్రాన్స్‌ఫార్మర్లను సరఫరా చేసి ఏర్పాటు చేయడం విశేషం. నిబంధనల ప్రకారం ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినప్పుడు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు 24 గంటల సమయం ఉంటుంది. ఇప్పుడు వారం రోజులకు కూడా ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా చేయలేని పరిస్థితి ఏర్పడింది. ట్రాన్స్‌ఫార్మర్లను విద్యుత్ శాఖనే సరఫరా చేయాలి. ట్రాన్స్‌పోర్టు ఖర్చులు కూడా భరించాల్సి ఉంది. అయితే రైతుల నుంచి ట్రాన్స్‌పోర్టు పేరుతో భారీగా డబ్బులు వసూలు చేసుకొని జేబులు నింపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఫీడర్లు కూడా తక్కువే..

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు 2,23,383. వీటికి 9 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలంటే డిమాండ్‌కు తగ్గట్టుగా ఫీడర్లు తప్పనిసరి. అయితే కర్నూలు జిల్లాలో 327, నంద్యాల జిల్లాలో 391 ఫీడర్లు మాత్రమే ఉన్నాయి. లోడ్‌కు తగ్గట్టుగా ఫీడర్లు లేకపోవడం వల్ల ఒత్తిడి పెరిగి కాలిపోతున్నట్లు రైతులు వాపోతున్నారు. లోవోల్టేజీ, హైవోల్టేజీ సమస్యలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.



గోనెగండ్ల మండలం లింగందిన్నెలో కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు సరఫరా చేసిన పాత డీపీ

ఇప్పటివరకు ఇచ్చింది 5వేల కనెక్షన్లే..

2024 జూన్ మాసంలో కర్నూలు జిల్లాలో 1.12 లక్షలు, నంద్యాల జిల్లాలో 1.06 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. కూటమి ప్రభుత్వంలో నేడు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల సంఖ్య కర్నూలు జిల్లాలో 1,14,311, నంద్యాల జిల్లాలో 1,09,072. అంటే ఈ 16 నెలల్లో ఇచ్చిన కనెక్షన్లు 5వేలు మాత్రమే కావడం గమనార్హం.

తొమ్మిది గంటల విద్యుత్ ఒట్టిదే

- దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో వ్యవసాయానికి 7 గంటల విద్యుత్ విజయవంతంగా అందించారు.
- 2014–15 నుంచి 2018–19 వరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల విడుదల అంతంత మాత్రమే ఉండగా.. 7 గంటల విద్యుత్ కూడా అస్తవ్యస్తంగా మారింది.
- ఎప్పుడు విద్యుత్ ఇస్తారో తెలియక రైతులు రేయింబవళ్లు పొలాల్లోనే కాపలా కాయాల్సిన దుస్థితి.
- రాత్రి వేళల్లో కరంట్ ఇవ్వడంతో ఎంతో మంది రైతులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోవడం గమనార్హం.
- ఇప్పుడు మళ్లీ పాత రోజులే వస్తుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.
- గత వైఎస్ఆర్‌సీపీ ఐదేళ్ల పాలనలో కూడా వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ విజయవంతంగా ఇచ్చినట్లు రైతులే చెబుతున్నారు.
- కూటమి ప్రభుత్వంలో 9 గంటల విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది.
- రోజుకు 6 గంటలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది.
- గత ఆగస్టు నుంచి జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. విద్యుత్ వినియోగం కూడా తగ్గింది. ఈ సమయంలో కూడా 9 గంటల విద్యుత్ ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఎమ్మెల్యే గౌరు అనుచరుల దాష్టీకం

- వంట ఏజెన్సీ నిర్వాహకుల్లో ఒకరిపై దాడి

కర్నూలు సిటీ: అధికారంలో ఉన్నామని, తమకు ఎదురు లేదని తెలుగుదేశం పార్టీ నాయకులు బరితెగించారు. విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం వడ్డిస్తున్న నిర్వాహకుల్లో ఒకరిపై పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అనుచరులు దాడికి పాల్పడ్డారు. బాధితులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు.. కర్నూలు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీ విద్యార్థులకు జీఎస్టీ 2.0పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బుధవారం ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గౌరు చరిత బహుమతులు ప్రదానం చేశారు. ఆమె తిరిగి వెళ్లే సందర్భంలో మధ్యాహ్న భోజనంపై కొంత మంది విద్యార్థులు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న వంట ఏజెన్సీ నిర్వాహకులకు చెందిన ఓ వ్యక్తికి, ఎమ్మెల్యే అనుచరుల మధ్య వాగ్వావాదం చోటు చేసుకుంది. ఈ సమయంలో వంట ఏజెన్సీ నిర్వాహకుల్లో ఒకరిపై ఎమ్మెల్యే అనుచరులు దాడి చేసినట్లు సమాచారం. ఇదే విషయంపై బాధితులు కర్నూలు 3వ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే విధంగా తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకునేంత వరకు బీక్యాంపులో ప్రభుత్వ జూనియర్, ప్రభుత్వ ఒకేషనల్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం చేయబోమని జిల్లా వృత్తి విద్యాధికారి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ ఘటనపై జూనియర్, ఒకేషనల్ కాలేజీల ప్రిన్సిపాళ్లను అడుగగా తమకు తెలియని చెప్పారు. ఇదిలా ఉండగా పై రెండు కాలేజీల్లో వంట ఏజెన్సీని ఎలాగైనా మార్చాలనే ఉద్దేశంతో వివిధ సందర్భాల్లో టీడీపీ నేతలు ప్రయత్నించారు. అయితే వారి ప్రయత్నాలు ఫలించలేదు.

హెల్త్ పింఛన్లకు రీ-వెరిఫికేషన్ నుంచి మినహాయింపు

కర్నూలు(అగ్రికల్చర్): హెల్త్ పింఛన్లు తీసుకుంటూ అనర్హత వేటు పడిన వారికి రీ-వెరిఫికేషన్ నుంచి మినహాయింపు లభించింది. ఈ మేరకు సెర్ప్ నుంచి ఆదేశాలు వచ్చాయి. కర్నూలు జిల్లాలో 17, నంద్యాల జిల్లాలో 64 హెల్త్ పింఛన్లు ఉండగా.. వీరికి గత ఆగస్టులో అనర్హత నోటీసులు ఇచ్చారు. వీరందరూ తమకు హెల్త్ పింఛన్లు పునరుద్ధరించాలని అప్పీల్ చేసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న సదరం క్యాంపులకు హాజరు కావాలని వీరికి కూడా నోటీసులు జారీ చేశారు. అయితే నోటీసులు అందుకున్న వారిని రీ వెరిఫికేషన్ నుంచి మినహాయిస్తూ సెర్ప్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. నోటీసులు కూడా ఇవ్వవద్దని డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లకు సూచించారు.

ఆర్టీసీ ఉద్యోగులందరికీ రక్షణ కల్పించాలి



నిరసన తెలుపుతున్న ఆర్టీ అద్దెబస్సుల డ్రైవర్లు

కర్నూలు సిటీ: ఆర్టీసీ ఉద్యోగులందరికీ రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ అద్దె బస్సుల డ్రైవర్లు నిరసన తెలిపారు. కర్నూలు కొత్త బస్టాండ్ ఆవరణలో మధ్యాహ్నం వరకు బస్సులను నిలిపి వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దువ్వూరులో ఇంటి దగ్గర బస్సును ఆపలేదన్న కారణంతో ఆళ్లగడ్డ డిపోలో అద్దె బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న మహమ్మద్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. దాడిలో గాయపడిన మహమ్మద్ తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారన్నారు. కోలుకునేందుకు ఆరు నెలల సమయం పడుతుందని, అంత వరకు ప్రభుత్వమే చికిత్సకు అయ్యే ఖర్చులు భరించాలన్నారు. డ్రైవర్‌కు రూ.5 లక్షల పరిహారం ప్రభుత్వం చెల్లించాలన్నారు. గతంలో ఎమ్మిగనూరు దగ్గర కూడా డ్రైవర్‌పై దాడి చేశారన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేసిన తరువాత ప్రయాణికుల రద్దీ పెరిగిపోయిందన్నారు. పెరుగుతున్న రద్దీని దృష్టిలో పెట్టుకొని అదనపు బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. డ్రైవర్లకు రక్షణ కల్పించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. హైర్ బస్సు కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్య గౌడ్, గౌరవ సలహాదారులు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి యు.శ్రీనివాసులు, జిల్లా నాయకులు రాంబాబు, చెన్నకేశవులు, మద్దిలేటి, మధు, ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యంతో ప్రజల్ని చంపేస్తారా?

- ఈ ప్రభుత్వానికి మహిళల ఉసురు తగులుతుంది
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరి



ఎక్సైజ్ కార్యాలయం ఎదుట బైఠాయించి మద్యం సీసాలు పగులగొడుతున్న మహిళలు, చిత్రంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరి

కర్నూలు (టౌన్): ' రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారుతోంది.. అమాయక ప్రజలు మద్యం తాగి పిట్టల్లా రాలుతున్నారు.. అయినా ఈ ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోంది.. చాలా దారుణం' అని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరి అన్నారు. ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఇలాగే వ్యవహరిస్తూ కల్తీ మద్యంతో ప్రజల్ని చంపేస్తారా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో బుధవారం కర్నూలులో నిరసన తెలిపారు. చిల్డ్రన్స్ పార్కు నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు మహిళలు ర్యాలీ నిర్వహించారు. ' సీఎం డౌన్.. డౌన్, కల్తీ మద్యం విక్రయాలు అరికట్టాలి' అని నినాదాలు చేశారు. 'నకిలీ మద్యంతో పేదలు పిట్టల్లా రాలిపోతున్నారు.. ప్రభుత్వ పెద్దలే మద్యం సూత్రధారులు.. రాష్ట్రంలో ఎస్–బ్రాండ్ విక్రయాలు' తదితర ప్లకార్డులను ర్యాలీలో ప్రదర్శించారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు కార్యాలయం ఎదుట బైఠాయించారు. మద్యాన్ని పారబోసి బాటిళ్లను పగులకొట్టారు. 'మద్యం తాగి ప్రజలు చనిపోతుంటే డిప్యూటీ సీఎం నోరు మెదపరేం, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఎక్కడ' అని ప్రశ్నించారు.



మద్యాన్ని పారబోస్తున్న దృశ్యం

దోషులను కఠినంగా శిక్షించాలి

నెల్లూరు, అన్నమయ్య జిల్లాల్లో కల్తీ మద్యం తాగి నలుగురు పేదలు మృతిచెందినా రాష్ట్రప్రభుత్వంలో చలనం లేదని ఎస్వీ విజయ మనోహరి విమర్శించారు. రాష్ట్రంలోని ప్రతి వైన్ షాపులో కల్తీ మద్యం అమ్ముతున్నా చర్యలు లేవన్నారు. కల్తీ మద్యం విక్రయాల వెనుక రాష్ట్ర పెద్దలు ఉన్నారని ఆరోపించారు. కల్తీ మద్యం తయారు చేసేందుకు టీడీపీ నాయకులు ఏకంగా ఫ్యాక్టరీ నడుపుతున్నారంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థమవుతోందన్నారు. విచ్చలవిడిగా రోడ్ల మీద మద్యం తాగుతున్నా ఎక్సైజ్, సివిల్ పోలీసులు పట్టించుకోవడం లేదని, దీంతో రాష్ట్రంలో ఎక్కడో ఒక చోట మహిళలపై అత్యాచారాలు, దాడులు జరుగుతున్నాయన్నారు. కల్తీ మద్యం దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మహిళలకు రక్షణ కరువు

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లా నాగవేణి రెడ్డి, భారతి, మంగమ్మ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని విమర్శించారు. నకిలీ మద్యం సరఫరా చేస్తూ పేద ప్రజలను నిలువు దోపిడీ చేస్తోందని ఆరోపించారు. అడ్డగోలు పర్మిట్ రూమ్‌లతో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. టీడీపీ నాయకులు వైన్ షాపుల ద్వారా కల్తీ మద్యం అమ్ముతుంటే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నోరు మెదపడం లేదన్నారు. ఈ ప్రభుత్వానికి మహిళల ఉసురు తగులుతుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బెల్టు షాపులు రద్దు చేయాలని, కల్తీ మద్యాన్ని అరికట్టాలని, పర్మిట్ లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నగరపాలక కార్పొరేటర్లు ఆర్షియా ఫర్హీన్, సయ్యద్ మల్లిఖాబేగం, పార్టీ మహిళలు పాల్గొన్నారు.

సీఐ ఓబులేసుకు అరెస్టు వారెంట్

కర్నూలు: కర్నూలు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో గతంలో నమోదైన పోక్సో కేసు దర్యాప్తు అధికారి అయిన సీఐ జి.ఓబులేసుకు అరెస్టు వారెంట్ జారీ చేస్తూ కర్నూలు పోక్సో న్యాయస్థానం ప్రత్యేక న్యాయమూర్తి ఇ.రాజేంద్రబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో కర్నూలు తాలూకా పోలీసులు సీఐకి సమన్లు జారీ చేయడంలో నిర్లక్ష్యం వహించారు. గత నెల 9న బెయిలబుల్ వారెంటు జారీ చేసినప్పటికీ పోలీసుల్లో చలనం లేకపోవడంతో బుధవారం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. అదే విధంగా ఇతర కేసుల్లో పోలీసులు సాక్షులకు సమన్లు అందజేయకుండా కోర్టు సమయాన్ని వృథా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవుకు పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఒక కేసులో విచారణకు షెడ్యూల్ ఇచ్చి ఎంతో సమయం ఇస్తూ సమన్లు జారీ చేసినప్పటికీ కోర్టు విచారణకు ముందురోజు సమన్లు అందివ్వడాన్ని న్యాయమూర్తి తప్పుబట్టారు. కోర్టులో రాతపూర్వకంగా పోలీసులు దాఖలు చేసే నివేదికలకు కోర్టు ప్రశ్నిస్తే పోలీసులు ఇచ్చే సమాధానాలకు పొంతన ఉండటం లేదన్నారు. సాక్షులకు సమన్లను పోలీసులు సకాలంలో అందించకపోతే ఎస్పీకి రిపోర్టు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.



‘బంగారు’ కాంతులు!

మండలంలోని జొన్నగిరి, బొల్లవానిపల్లి, పగిడిరాయి గ్రామాల మధ్య జియో మైసూర్ గోల్డ్ మైనింగ్ కంపెనీ ప్రాసెసింగ్ ప్లాంట్ రాత్రి పూట విద్యుత్ కాంతులతో వెలిగిపోతోంది. 30 ఎకరాల్లో దాదాపు రూ.200 కోట్లతో గోల్డ్ మైనింగ్ ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్మించారు. ప్లాంట్ లోపలి భాగంలో చుట్టూ పచ్చని గడ్డితో పాటు మొక్కలు నాటారు. అధునాతన హంగులతో ప్లాంట్ నిర్మాణం పూర్తయింది. ఈనెలఖారు నుంచి ప్లాంట్‌లో బంగారం ఉత్పత్తి మొదలు కానుండటం విశేషం.

–తుగ్గలి

క్లుప్తంగా

ఐద్వా జిల్లా నూతన కమిటీ ఎన్నిక

● అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.శ్యామల, కె.అరుణ


ఎస్.శ్యామల


కె.అరుణ

కర్నూలు(సెంట్రల్): ఐద్వా జిల్లా నూతన కమిటీని 35 మందితో ఎన్నుకున్నారు. ఇటీవల జరిగిన జిల్లా మహాసభల్లో నూతన కమిటీని ఎన్నుకోగా గౌరవాధ్యక్షురాలుగా పి.నిర్మల అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.శ్యామల, కె.అరుణ, కోశాధికారిగా పీఎస్ సుజాతలతో పాటు ముగ్గురు ఉపాధ్యక్షులు, ముగ్గురు సహాయ కార్యదర్శులు, 13 మంది ఆఫీసు బేరర్లు, 22 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ క్రమంలో బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. బెల్టుషాపుల రద్దు, మద్యం దుకాణాల సమయాన్ని కుదింపు కోసం పోరాటాలు చేస్తామన్నారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలపై వడ్డీని మాఫీ చేయాలన్నారు.

యువకుడి బలవన్మరణం


శివప్ప (ఫైల్)

ఆలూరు రూరల్: ఆర్థిక కష్టాలతో మనస్తాపానికి గురై యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కురుకుంద గ్రామానికి చెందిన శివప్ప (32) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం పక్షవాతం వచ్చి తండ్రి మునెప్ప మంచాన పడ్డాడు. ఎనిమిదేళ్ల క్రితం శివప్ప అన్న మృతిచెందాడు. తల్లి మల్లమ్మ, కుమారుడు శివప్ప వ్యవసాయ పనులకు వెళ్లేవారు. ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఒత్తిడి తట్టుకోలేక మూడు రోజుల క్రితం ఇంటి నుంచి శివప్ప వెళ్లిపోయాడు. ఆలూరులోని గుంతకల్లు రహదారి పక్కన పురుగు మందు తాగి శవమై కనిపించాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్య

సంజామల: కానాల గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ రమణయ్య తెలిపిన వివరాల మేరకు.. కానాల గ్రామానికి చెందిన ఏరాశి దస్తగిరి, సుశీల కుమార్తె ఏరాశి శ్యామల(17) అవుకు మోడల్ స్కూల్‌లో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతోంది. దసరా సెలవుల నుంచి ఇంటి దగ్గరనే ఉంటుంది. బుధవారం తెల్లవారుజామున తల్లిదండ్రులు నిద్రిస్తుండగా ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తమ కుమార్తె కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకుందని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆయిల్ ఇంజిన్‌లో పాము


ఇంజిన్ ఫ్యాన్‌ను చుట్టేసిన పాము

మహానంది: బొల్లవరం గ్రామానికి చెందిన తిరుమల కృష్ణ, మరికొంత మంది రైతులు బుధవారం వారి పొలాలకు నీళ్లు పెట్టేందుకు వెళ్లి ఆయిల్ ఇంజిన్‌ను ఆన్ చేయగా ఎంత సేపటికి ఆన్ కాలేదు. ఏమైందోనని పరిశీలించగా ఫ్యాన్ (పంకా) వద్ద ఓ పాము ఇరుక్కుపోయి ఉండటాన్ని గుర్తించారు. బతికి ఉందేమోనని చూస్తే అది అప్పటికే మృతి చెందినట్లు చూసి తీసేశారు.

శరవేగంగా మోదీ పర్యటన ఏర్పాట్లు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ సిరి


బహిరంగ సభ వేదిక ఏర్పాట్లు

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల 16వ తేదీన కర్నూలు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు చకచకగా సాగుతున్నాయి. నన్నూరు టోల్ గేటు దగ్గర ఉన్న రాగమయూరి వద్ద ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లు జరుగుతున్నాయి. బహిరంగ సభ, హెలిపాడ్, 11 చోట్ల పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. సమయం దగ్గర పడుతుండడంతో పనులు వేగం పుంజుకుంటున్నాయి. అధికారులు ఇతర జిల్లాల నుంచి జేసీబీలు, ఇతర పరికరాలతో పాటు కూలీలను తీసుకొచ్చి పనులను వేగవంతం చేశారు. కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఉదయం, సాయంత్రం దగ్గరుండి ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి టీజీ భరత్ కూడా పనులను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేస్తున్నారు. సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మంతెన్న సత్యనారాయణరాజు కూడా బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు.

తాత్కాలిక ఆసుపత్రులు ఏర్పాటు చేయండి..

బహిరంగ సభ ప్రాంగణంలో వీవీఐపీల కోసం 10 పడకలు, ప్రజల కోసం 20 పడకల తాత్కాలిక ఆసుపత్రులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పార్కింగ్ ప్రాంతాల్లో రెండు బేసిక్ లైఫ్ సపోర్టెడ్ అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచడంతో పాటు మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. హెలిపాడ్, ఓర్వకల్ పీహెచ్‌సీల వద్ద స్పెషలిస్టు వైద్యులు, ఎమర్జెన్సీ మెడికల్ బృందాలు, స్ట్రెచర్లు, వీల్ చైర్లు, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతి కళను ఆదేశించారు.


బహిరంగ సభ ప్రాంతాన్ని యంత్రాలతో చదును చేస్తున్న దృశ్యం


ప్రజా ప్రతినిధుల కోసం ఏర్పాట్లు

భద్రత కట్టుదిట్టం

● పోలీసు అధికారులతో సమీక్షలో అడిషనల్ డీజీ

కర్నూలు: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన నేపథ్యంలో భద్రత కట్టుదిట్టం చేయాలని అడిషనల్ డీజీ మధుసూదన్ రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. పీఎం పర్యటన ఏర్పాట్లపై ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు దగ్గర ఉన్న ఏరో వన్ ఫంక్షన్ హాల్‌లో ఐజీ, డీఐజీలు, ఎస్పీలతో మధుసూదన్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. మొదట గూగుల్ రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామ శివారులో ఉన్న రాగమయూరిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ, ఇతర ప్రదేశాల గురించి పర్యటన వివరాలను కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను అడిగి తెలుసుకున్నారు. వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, హెలి ప్యాడ్, బహిరంగ సభ, వాహనాల డైవర్షన్స్ తదితర విషయాల గురించి అడిషనల్ డీజీ, ఐజీ, డీఐజీలకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ వివరించారు. మోడీ పర్యటించే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా అడిషనల్ డీజీ మధుసూదన్ రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి ఆపై స్థాయి అధికారులు మాత్రమే ప్రధాని పర్యటన బందోబస్తు విధులకు కేటాయించాలన్నారు. విధులకు కేటాయించిన పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ పూర్తి బాధ్యత వహించాలన్నారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించే రాగమయూరి ప్రాంతంలో పర్యటించి భద్రతా ఏర్పాట్లను డ్రోన్ కెమెరా ద్వారా పరిశీలించారు. సమావేశంలో ఐజీ శ్రీకాంత్, డీఐజీలు కోయ ప్రవీణ్, సెంథిల్ కుమార్, సత్య ఏసుబాబు, ఫక్కీరప్ప కాగినెల్లి, ఎస్పీలు షెల్కేనచికేత్ విశ్వనాథ్, కృష్ణకాంత్, మణికంఠ చందవోలు, దేవరాజు, ధీరజ్ కునుబిల్లి, దీపిక పాటిల్‌తో పాటు అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, ఇంటెలిజెన్స్ అధికారులు, సీఐలు, ఆర్ఐలు కార్యక్రమంలో పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు


పీఎం బహిరంగ సభ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ డీజీలు మధుసూదన్ రెడ్డి, శ్రీకాంత్, ఇతర పోలీసు అధికారులు

నకిలీ మద్యం విక్రయాలపై దృష్టి సారించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ నోడల్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

కర్నూలు: అన్నమయ్య జిల్లా మొలకల చెరువు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో, విజయవాడలోని ఇబ్రహీం పట్నం వద్ద పట్టుబడిన నకిలీ మద్యాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లాలో తనిఖీలు విస్తృతం చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నోడల్ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీదేవి అధికారులను ఆదేశించారు. కర్నూలులోని ప్రధాన కార్యాలయంలో బుధవారం కర్నూలు, నంద్యాల జిల్లాల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లతో ఆమె నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటికే సారా రహిత ప్రాంతాలుగా ప్రకటించిన గ్రామాల్లో తిరిగి నాటుసారా తయారు కాకుండా నిఘా ఉంచి పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. పాత కేసుల్లో ముద్దాయిలను బైండోవర్ చేసి వారి ప్రస్తుత కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. పొరుగు రాష్ట్రాల మద్యం జిల్లాలోకి ప్రవేశించకుండా నిరంతరం దాడులు కొనసాగించాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ రావిపాటి హనుమంతరావు, ఎక్సైజ్ జిల్లా అధికారి మచ్చ సుధీర్ బాబు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు రామకృష్ణారెడ్డి, రాజశేఖర్ గౌడ్‌లతో పాటు కర్నూలు, నంద్యాల జిల్లాల ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున కొత్తపల్లె చెరువు


కోతకు గురైన చెరువు కట్ట

కోడుమూరు రూరల్: కొత్తపల్లె చెరువు కట్ట కోతకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువు పూర్తి స్థాయిలో నిండిపోయింది. ఇదే సమయంలో కొతపల్లె నుంచి కృష్ణగిరి వైపు వెళ్లే దారిలో ఉన్న చెరువు కట్ట బలహీనంగా ఉండడంతో కొంత భాగం కోతకు గురై చెరువులోని నీళ్లన్నీ రైతుల పొలాలను ముంచెత్తుతున్నాయి. అధికారులు కోతకు గురైన చెరువు కట్టకు సకాలంలో మరమ్మతులు చేయకుండా అలాగే వదిలేయడంతో రోజురోజుకు కోత పెరిగిపోతుంది. భారీ వర్షాలు పడి చెరువుకు నీళ్లు పోటెత్తితే కట్ట పూర్తిగా కోతకు గురైతే తమ పంట పొలాలు నీట మునిగే పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే చెరువు కట్టకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పిడుగుపాటుకు ఐదు జీవాలు మృతి

బనగానపల్లె రూరల్: పసుపల గ్రామ సమీపంలో బుధవారం ఉదయం పిడుగుపడి ఐదు జీవాలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన మద్దిలేటి స్వామికి వంద జీవాలు ఉన్నాయి. ఉదయం పసుపల గ్రామ సమీపంలోని పోలిక కొండ వద్ద జీవాలు మేత మేస్తుండగా అకస్మాత్తుగా భారీ వర్షం కురిసింది. ఆదే సమయంలో పిడుగు పడటంతో ఐదు జీవాలు అక్కడికక్కడే మృతి చెందినట్లు మద్దిలేటిస్వామి తెలిపారు. వీటి విలువ సుమారు రూ.40 వేలు ఉంటాయన్నారు.


మృతి చెందిన జీవాల వద్ద బాధితుడు మద్దిలేటి

పీఎం సభకు రైతుల పొలాల వినియోగం

● పరిహారం పంపిణీకి అధికారుల చర్యలు

కల్లూరు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ కర్నూలు పర్యటనలో భాగంగా నన్నూరు టోల్ గేటు సమీపంలో ఏర్పాటు చేసే బహిరంగ సభ కోసం రైతుల పంట పొలాలను వినియోగించాల్సి వస్తోంది. రాగమయూరి గ్రీన్ హిల్స్‌లో సభను ఏర్పాటు చేస్తున్నా ముఖ ద్వారం చుట్టు పక్కల తాండ్రపాడు, నన్నూరు, తడకనపల్లె గ్రామాలకు సంబంధించిన కొందరి రైతుల పంట పొలాలను వినియోగిస్తున్నారు. దీంతో ఆ భూముల రైతులకు పరిహారం ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం కర్నూలు, కల్లూరు మండలాల వ్యవసాయాధికారులతో పంట ఎన్యుమరేషన్ చేయించారు. దాదాపు 81 ఎకరాల్లో వ్యవసాయాధికారులు పంట ఎన్యుమరేషన్‌ను పూర్తి చేశారు. ఈ క్రమంలో వ్యవసాయాధికారుల నివేదిక ప్రకారం రైతులకు ఇచ్చే పరిహారాన్ని గురువారం ఖరారు చేయనున్నారు. కాగా సరైన పరిహారం ఇవ్వకపోతే నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

● ఉల్లి పంట తొలగింపు


పంటను ట్రాక్టర్‌తో దున్నేస్తున్న దృశ్యం

మద్దికెర: మార్కెట్‌లో ధర లేక మద్దికెర గ్రామానికి చెందిన వరదరాజులు అనే రైతు ఏడు ఎకరాల్లో సాగు చేసిన ఉల్లి పంటను ట్రాక్టర్‌తో బుధవారం దున్నేశాడు. ఎకరా రూ.14 వేలు పెట్టి కౌలుకు తీసుకున్నానని, రూ.2.50 లక్షలు పెట్టుబడి పెట్టి ఉల్లి సాగు చేసినా కూలీ కోతలు కూడా రాకపోవడంతో పంటను ట్రాక్టర్‌తో తొలగించామని రైతు తెలిపారు.

ఉద్యాన పంటల సాగుకు రాయితీ వర్తింపు

● జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు

పాములపాడు: ఉద్యాన పంటలైన ఆయిల్ ఫామ్, డ్రాగన్ ఫ్రూట్ పంటల సాగు చేసే రైతులకు రాయితీ వర్తింపజేస్తున్నట్లు నంద్యాల జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు తెలిపారు. బుధవారం మండలంలో డ్రాగన్ ఫ్రూట్, ఆయిల్ ఫామ్ ఇతర ఉద్యాన పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్‌ఫామ్ పంట ద్వారా మంచి ఆదాయాలను పొందవచ్చన్నారు. ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ ఫామ్ మొక్కలతో కలిపి రూ.70 వేల దాకా సబ్సిడీ ఉందని తెలిపారు. డ్రాగన్ ఫ్రూట్ పంటకు హెక్టార్‌కు రూ.2.6 లక్షలు సబ్సిడీ వర్తిస్తుందని చెప్పారు. ఉద్యాన పంటలకు డ్రిప్ ఆవశ్యకత ఎంతగానో ఉందని, డ్రిప్ ద్వారా 90 శాతం నీరు ఆదా చేయడమే కాక కూలీల ఖర్చు తగ్గుతుందన్నారు. ఆయన వెంట ఆత్మకూరు ఉద్యాన శాఖ అధికారిణి చందన, లింగాల ఎంపీఈఓలు సునీత, నందికుంట శేషు, ఎర్రగుడూరు వీహెచ్‌ఏ ముక్తార్ బాషా, పతాంజలి కంపెనీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి నుంచి ప్లాట్లకు రక్షణ కల్పించాలి


మాట్లాడుతున్న బాధితులు కృష్ణమూర్తి, నరసింహరావు, రాజు, వెంకటేష్

కర్నూలు(సెంట్రల్): 20 ఏళ్ల క్రితం కల్లూరు పరిధిలోని సర్వే నంబర్ 292లో ఉన్న 3.95 ఎకరాల్లో డీటీసీపీ అప్రూవల్ లేవుట్‌లోని తమ ప్లాట్లను టీడీపీ నాయకుడు పోలిశెట్టి దేవేంద్ర కుమార్ ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నాడని బాధితులు కృష్ణమూర్తి, నరసింహరావు, రాజు, వెంకటేష్ అధికారులను కోరారు. టీడీపీ నేత నుంచి తమ ప్లాట్లకు రక్షణ కల్పించాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో సి.వెంకట నారాయణమ్మకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆ లేవుట్‌లో దాదాపు 30 మంది ప్లాట్లను విక్రయించారని, అందులో చాలా మంది ఇళ్లు కట్టుకొని కూడా నివాసం ఉంటున్నారన్నారు. అయితే ఆ స్థలం తమ తాతల ఆస్తి అంటూ టీడీపీ నాయకుడు పోలిశెట్టి దేవేంద్రకుమార్ ఆక్రమించుకునేందుకు ఇటీవల జేసీబీతో వచ్చి సైడ్‌వాల్స్‌ను పూర్తిగా ధ్వంసం చేశారన్నారు. ఆయన నుంచి తమ ప్లాట్లను కాపాడాలంటూ స్థలం కొనుగోలు చేసిన డాక్యుమెంట్లను చూపించారు.

ఆటోను ఢీకొట్టిన కారు

● ఇద్దరు ఉపాధ్యాయులతో పాటు మరో ఇద్దరికి గాయాలు

మహానంది: నంద్యాల - మహానంది రహదారిలో బుక్కాపురం మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. తిమ్మాపురం నుంచి ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను బుక్కాపురం మలుపు వద్ద వెనుక నుంచి వస్తున్న కారు ఓవర్ టేక్ చేయబోయి వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో పుట్టుపల్లె పాఠశాల ఉపాధ్యాయురాలు రాఘవేంద్రమ్మ, అబ్బీపురం ఉపాధ్యాయురాలు ఉమా మహేశ్వరమ్మలతో పాటు ఆటో డ్రైవర్ బాలస్వామి, ప్రయాణికుడు పుట్టుపల్లెకు చెందిన జయరాముడు తీవ్రంగా గాయపడ్డారు. అదే సమయంలో నంద్యాల నుంచి వస్తున్న మహానంది ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి ప్రమాద ఘటన చూసి చలించి వెంటనే పోలీస్ వాహనంలో గాయపడిన వారికి చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నాడు. అనంతరం వివరాలు సేకరించి ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్, ఓనర్ ఈశ్వర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.


.గాయపడిన ఉపాధ్యాయురాళ్లు

తేనెటీగల పెంపకంతో అదనపు ఆదాయం



మాట్లాడుతున్న నంద్యాల ఆర్ఏఆర్ఎస్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ జాన్సన్

ఎమ్మిగనూరుటౌన్: తేనెటీగల పెంపకంతో రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని నంద్యాల ఆర్ఏఆర్ఎస్ అసోసియేట్ డైరెక్టర్ రీసెర్చ్ డాక్టర్ ఎం.జాన్సన్ అన్నారు. బనవాసి కేవీకేలో నూనెగింజల మిషన్ ఎన్‌బీహెచ్ఎం ఆధ్వర్యంలో శాస్త్రీయ తేనెటీగల పెంపకంపై 30 మంది రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. తేనెటీగల పెంపక ప్రాధాన్యత, పంటల పరాగసంపర్కంలో వాటి పాత్ర, తేనె ఉత్పత్తి ద్వారా రైతులు పొందే అదనపు ఆదాయం గురించి పలువురు వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.జాన్సన్ మాట్లాడుతూ.. తేనెటీగల శాస్త్రీయ పెంపకం ద్వారా నూనెగింజలు పంటల ఉత్పాదకత పెరుగుతుందన్నారు. అలాగే పర్యావరణ సమతుల్యతను కూడా కాపాడినవారవుతారన్నారు. కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త డాక్టర్ కే.రాఘవేంద్రచౌదరి, శాస్త్రవేత్తలు డాక్టర్ బి.సహదేవరెడ్డి, డాక్టర్ అశోక్‌కుమార్, మంజునాథ్, సుజనమ్మ, శివశంకర్, మల్లికార్జున, రమేష్, ఏడీఏ మహమ్మద్‌ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

● పర్యవేక్షణ కరువై.. సేవలు దూరమై!



నాగలదిన్నెలో ఉదయం 11 గంటలైనా తెరచుకోని సచివాలయం

నందవరం: గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన సచివాలయాలపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. దీంతో అందులో పని చేసే ఉద్యోగులు విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇందుకు నాగలదిన్నె గ్రామంలోని సచివాలయ ఉద్యోగులే నిదర్శనం. గ్రామంలో ఒకే చోట సచివాలయం 1, 2 ఉన్నాయి. ప్రస్తుతం రెండు సచివాలయాల్లో దాదాపు 14 మంది విధులు నిర్వహిస్తున్నారు. కాగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి వివిధ పనుల మీద ప్రజలు అక్కడికి చేరుకున్నారు. అయినా 11 గంటలైనా సచివాలయానికి తాళం కూడా తీయలేదు. 11. 40 గంటల తర్వాత ఒకరిద్దరు రావడం మొదలు పెట్టారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి కొందరు పోయారని చెబుతుండగా, మిగతా వారిలో కొందరు ఆలస్యంగా రావడంపై ప్రజలు మండిపడ్డారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉద్యోగులపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న గురుకులాల కోఆర్డినేటర్ శ్రీదేవి

కల్లూరు: క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి అన్నారు. బుధ వారం కల్లూరు మండలం చిన్నటేకూరులోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌లో జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీదేవి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. జిల్లాకు చెందిన ఖోఖో, వాలీబాల్, కబడ్డీ క్రీడాకారులు ప్రతిభకనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు, ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాఘవేంద్ర, పలువురు ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ఈ–క్రాప్ నమోదు

● రెండున్నర నెలలు గడిచినా 41.6 శాతమే పూర్తి

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ పంటల నమోదు అస్తవ్యస్తంగా మారింది. పొలంపై ఉన్న పంట ఒకటైతే.. ఈ–క్రాప్‌లో నమోదు చేస్తున్న పంట మరొకటనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్న ఐదేళ్లు పంటల నమోదు ప్రక్రియ పారదర్శకంగా జరిగింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పంటల నమోదు ప్రక్రియ అవకతవకలకు కేంద్రమవుతోంది. ఖరీఫ్ సీజన్ సెప్టెంబర్ 30తోనే ముగిసిపోయినప్పటికీ పంటల నమోదు అంతంత మాత్రంగానే ఉంది. ఇప్పటి వరకు కేవలం 4,11,704 సర్వే నెంబర్లలోని 6,94,235 ఎకరాలు నమోదు చేశారు. రెండున్నర నెలల్లో 41.6 శాతం మాత్రమే పంటల నమోదు పూర్తయినట్లు తెలుస్తోంది. ఆలూరు, ఓర్వకల్, చిప్పగిరి, హాలహర్వి, కర్నూలు రూరల్ మండలాల్లో పంటల నమోదు అంతంతమాత్రంగానే ఉన్నట్లు వెల్లడవుతోంది. నమోదు అస్తవ్యస్తం కావడం, సుదీర్ఘంగా సాగుతుండటంతో ప్రభుత్వం ఈ–క్రాప్ బుకింగ్‌ను ఈ నెల 25 వరకు పొడిగించింది. పై నుంచి ఒత్తిడి పెరుగుతుండటంతో పంటల నమోదులో వీఏఏలు, వీహెచ్‌ఏలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలాఉంటే గ్రామ స్థాయిలో టీడీపీ నేతలు, రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జీలు కుమ్మక్కై ఉల్లి పంటను నమోదు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో పత్తి దాదాపు 6 లక్షల ఎకరాల్లో సాగయింది. ఈ–క్రాప్‌లో మాత్రం పత్తి నమోదు మందగించింది. కోడుమూరు, దేవనకొండ, కర్నూలు రూరల్, పత్తికొండ, సీ.బెలగల్, గోనెగండ్ల తదితర మండలాల్లో ఏకపక్షంగా ఉల్లి నమోదవుతుందటం గమనార్హం.


పంటల నమోదు దృశ్యాలు

నోటిఫైడ్ పంటలకు మాత్రమే ఈ–కేవైసీ

గతంలో ఈ–క్రాప్‌లో నమోదైన అన్ని పంటల నమోదుకు రైతుల నుంచి ఈ–కేవైసీ తీసుకున్నారు. బయోమెట్రిక్ ద్వారా లేదా ఓటీపీ ద్వారా ఈ–కేవైసీ చేయించారు జరిగేది. ఈ సారి మాత్రం ప్రధానమంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత బీమా కింద నోటిఫై చేసిన పంటలకు మాత్రమే ఈ–కేవైసీ చేయించుకునేలా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. అయితే ఇంతవరకు ఆ దిశగా చర్యలు కరువయ్యాయి.

మొదట్లో అనుమానం వచ్చినా రాజీ పడ్డారు

ఈ–క్రాప్‌లో ఉల్లి పంట శరవేగంగా నమోదవుతుండటాన్ని గమనించిన జిల్లా ఉన్నతాధికారులు విస్తు పోయారు. తహసీల్దార్లు, ఆర్డీఓలతో తనిఖీలు చేయించాలని నిర్ణయించారు. అయితే ఆ తర్వాత రాజీపడి మిన్నకుండిపోయారు. అధికార టీడీపీ నేతల సూచనలతో ఈ–క్రాప్‌లో ఉల్లి నమోదు పరిశీలన ప్రక్రియ మరుగున పడినట్లు తెలుస్తోంది. ఉల్లి సాధారణ సాగు 41,442 ఎకరాలు మాత్రమే. ఈ సారి ఈ–క్రాప్‌లో ఇప్పటికే 58 వేల ఎకరాలకు చేరిందంటే.. పంటల నమోదు ప్రక్రియ ముగిసే సమయానికి 75 వేల ఎకరాలకు చేరే అవకాశం ఉన్నట్లు ఉద్యాన అధికారులు అంచనా వేస్తున్నారు.